సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 23 । జనవరి । 2023



'స్మార్ట్' పాఠాలు

సర్కారు బడిలో స్మార్ట్‌గా పాఠాలు వినిపిస్తున్నాయి. మిస్టర్ లెర్నర్ యాప్ దీనికి సహకరిస్తోంది. - 8లో



వ్యసనాలకు బానిసై..

వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీకాకుళం సమీపంలో ఘటన జరిగింది. - 8లో

వైభవంగా శాంతిహోమం

జి.సిగడాం: మండలంలోని ఆనందపురంలో గురువారం 100 అడుగుల వెంకటి సాయికోటి మహాస్థూపం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సత్యవ్రతాలు, శాంతిహోమం నిర్వహించారు. చిన్నారులకు అన్న ప్రాసన చేయించారు. గురువులు అమ్మల సాంబశివరావు ఆశీస్సులతో ఆలయ నిర్మాత మక్క వెంకటిసాయి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సెల్‌ఫోన్లు కొట్టేస్తున్నారు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురంలో దొంగలు రెచ్చిపోతున్నారు. ఆదివారం పట్టణంలోని మెయిన్ రోడ్డులో ఆర్టీసీ డ్రైవర్ యు.కృష్ణారావు మందులు కొనుగోలు చేసేందుకు షాపుకి వెళ్తుండగా బైక్‌పై వచ్చిన యువకుడు బండి పడిపోయినట్లు నాటకమాడి సాయం చేసేందుకు వచ్చిన వారి నుంచి సెల్‌ఫోన్ కాజేశాడు. దీనిపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ కె.గోవిందరావు మాట్లాడుతూ చోరీకి గురైన ఫోన్లను రికవరీ చేస్తామన్నారు. పట్టణంలో ప్రత్యేక నిఘా ఏర్పాటుచేసి సెల్‌ఫోన్ దొంగలను అదుపులోనికి తీసుకుంటామని తెలిపారు.

912 టిడ్కో ఇళ్ల పనులు పూర్తి



టాటా కంపెనీ ప్రతినిధులతో చర్చిస్తున్న చెన్నూరు మల్లేశ్వరరావు

కాశీబుగ్గ: వచ్చే మార్చి ఆఖరి నాటికి ఏపీ టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ఏహెచ్‌పి ఇళ్ల సముదాయాన్ని పరిశీలించిన సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు చెన్నూరు మల్లేశ్వరరావు అన్నారు. పలాస మండలం బొడ్డపాడు పంచాయతీ పరిధిలో పునఃనిర్మాణం జరుగుతున్న అర్బన్ హౌసింగ్ ప్రాజెక్టును ఆదివారం సందర్శించి మాట్లాడారు. టాటా కంపెనీ డిప్యూటీ మేనేజర్ కె.హరీష్‌తో మాట్లాడారు. ఇప్పటికే 912 ఇళ్ల పనులు పూర్తయ్యాయని, పుట్టీ, టైల్స్ వర్క్, ప్లంబింగ్, డోర్స్ వేయడం జరిగిందని ఇతర ఇళ్లు సైతం మార్చి 31 నాటికి అందిస్తామన్నారు.

దోపిడీ దొంగల కలకలం



గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

మెళియాపుట్టి: దీనబంధుపురం పంచాయతీ పరిధిలోని డేగల కొలూరు గ్రామంలో దోపిడీ దొంగల ఘటన మరువక ముందే ఆదివారం రాత్రి చింతలపోలూరు గ్రామంలో దొంగలు కలకలం సృష్టించారు. గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోకి చొరబడటంతో గ్రామస్తులు అప్రమత్తమై కేకలు వేశారు. దీంతో దొంగలు పరుగులు తీశారు. స్థానిక గ్రామ పెద్దలు పోలీసులకు సమాచారం చేరవేయటంతో మెళియాపుట్టి ఎస్‌ఐ టి.రాజేష్ సిబ్బందితో గ్రామానికి వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. ఎవరూ దొరకలేదని ఎస్‌ఐ చెప్పారు. గ్రామస్తులను అప్రమత్తం చేయటంతో పాటు పోలీసు నిఘాను ఏర్పాటు చేశామని తెలిపారు.

అలరించిన కోయ నృత్యం



ధనరాజులమ్మ సంబర మహోత్సవంలో అలరిస్తున్న కోయనృత్యం

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజులమ్మ ఆలయానికి ఆదివారం ఆంధ్ర, ఒడిశా ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు పోటెత్తారు. తులసిగాం గ్రామానికి చెందిన భక్తులు మేళతాళాలతో అమ్మవారి నైవేద్యం గజముద్దను ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా ఒడిశా సుర్లాకు చెందిన కోయ నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు దరువులకు కోయరాజులు, కోయ రాణుల వేషధారణల్లో కళాకారులు చేసిన నృత్య ప్రదర్శన అలరించింది.

ట్రాఫిక్ కిటకిట



కాంప్లెక్సు బయటే ఆటోలు ఇలా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిత్యం ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. ఆర్టీసీ కాంప్లెక్సు ఎదురుగా బస్సులు ఆపే పరిస్థితి లేకున్నా.. ఆటోలు మాత్రం టికెట్ల కోసం అక్కడే నిలిపేస్తున్నారు. పండగ సందర్భంగా పెద్ద సంఖ్యలో బస్సులు రాకపోకలు సాగిస్తుండడంతో ఆటోల తీరు ఇబ్బంది కలిగిస్తోంది.

కలలు నెరవేరుతున్నాయి..!

- ఉన్నత చదువులు చదువుకుంటున్న సామాన్యులు
- అండగా నిలుస్తున్న జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలు
- జిల్లాలో ఏటా 69వేల మంది విద్యార్థులకు ప్రయోజనం



శ్రీకాకుళం పాతబస్టాండ్: సామాన్యుడికి ఉన్నత చదువు చేరువవుతోంది. బుర్ర నిండా తెలివితేటలు ఉన్నా జేబు నిండా డబ్బు లేకపోవడంతో నిన్నటి తరంలో చాలా మంది ఉన్నత చదువులకు దూరమయ్యారు. కుటుంబ ఆర్థిక స్థితిగతుల మూలాన ఇష్టం లేని కొలువులు, వ్యాపారాలు, చిరుద్యోగాల్లో చేరి సర్దుకుపోయారు. కానీ నేటి తరానికి ఓ ఊతం దొరికింది. 'నువ్వు చదువుకో.. నేను ఫీజు కడతా' అంటూ భరోసా ఇచ్చే నాయకుడు దొరికాడు. పేద, మధ్య తరగతి కుటుంబాల్లోని పిల్లలకు జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన పథకాలతో వైఎస్ జగన్ సర్కారు కొండంత అండగా నిలుస్తోంది. ఈ సాయంతో చాలా మంది పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే తమ కలలను నెరవేర్చుకుంటున్నారు.

పేదల బతుకుల్లో వెలుగులు

జగన్న విద్యా వసతి, విద్యాదీవెన పథకంతో జిల్లాలో పేదల విద్య సాగుతోంది. ఈ పథకం బీసీ, ఈబీసీ, ఎస్సీ, ఎస్టీ, తదితర కులాలకు చెందిన పేద పిల్లలకు అమలవుతోంది. 2020-21లో రెండు విడతల్లో 64,623 మంది విద్యార్థులకు జగనన్న వసతి దీవెన పథకం కింద రూ. 62.33 కోట్లు విడుదల చేశారు. అలాగే జగనన్న విద్యాదీవెన పథకం కింద 67,940 మంది విద్యార్థులకు గాను రూ.67.27 కోట్లు విడుదల చేశారు. 2021-22 సంవత్సరానికి గాను మూడు విడతల్లో 54,764 మంది విద్యార్థులకు జగనన్న వసతి దీవెన కింద రూ.81.61 కోట్లు అందించారు. జగనన్న విద్యాదీవెన కింద 68,913 మంది విద్యార్థులకు రూ.63.52 కోట్లను అందజేశారు. ఈ ఏడాది ఇంకా కొన్ని విభాగాల్లో ప్రవేశాలు జరుగుతున్నాయి. అర్హులందరికీ జ్ఞాన భూమి పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. జగనన్న వసతి, విద్యా దీవెన పథకాలు డబ్బులు నేరుగా విద్యార్థి తల్లి ఖాతాలో జమ చేస్తున్నారు. విద్యా దీవెన పథకంలో నిర్ణయించిన ఫీజులు చెల్లించగా, వసతి దీవెన పథకం కింద ఐటీఐ చదువుతున్న విద్యార్థులకు రూ.10వేలు, పాలిటెక్నికల్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ ఆపై తరగతులు చదువుతున్న వారికి రూ.20 వేలు చెల్లిస్తున్నారు.

రుణపడి ఉంటాం..



నా పేరు పొదిలాపు పార్వతి. నాది శ్రీకాకుళం మండలం లంకాం గ్రామం. నా భర్త పదేళ్ల కిందటే కాలం చేశారు. నాకు ఇద్దరు ఆడపిల్లలు. చిన్న పిల్ల దీపిక ఇంటర్మీడియెట్ చదువుతోంది. పెద్ద పిల్ల గీతిక విశాఖపట్నంలో ఇంజినీరింగ్ చేస్తోంది. మా ఇద్దరు పిల్లలను జగనన్నే చదివిస్తున్నారు. చిన్నపిల్లకు అమ్మ ఒడి వస్తుంది. పెద్ద పిల్లకు విద్యాదీవెన, వసతి దీవెన వస్తుంది. కాలేజీ ఫీజులకు, చదువు పుస్తకాలకు ఖర్చులకు ప్రభుత్వం సాయం మాకు ఎంతో మేలు చేస్తోంది. నేను నా పిల్లలు జగనన్నకు రుణపడి ఉంటాం.

నా లాంటి వారికి మేలు



నా పేరు పైడి మాధవరావు. మాది శ్రీకాకుళం మండలం వాకలవలస గ్రామం. మాకు స్థిర చరాస్తులు లేవు. కష్టపడి జీవనం సాగిస్తున్నాం. నేను ఒక ప్రైవేటు వ్యాపారి వద్ద రోజు కూలీగా పనిచేస్తున్నా. నాకు ఇద్దరు కవల పిల్లలు. ఇద్దరూ ఇంజినీరింగ్ చదువుతున్నారు. నిజానికి వీరిని పెద్ద చదువులు చదివించే స్థోమత మాకు లేదు. ఇంటర్ చదివేటప్పుడు మా పిల్లలకు అమ్మ ఒడి వచ్చింది. ప్రస్తుతం ఇద్దరినీ విజయనగరంలోని లెండి ఇంజినీరింగ్ కళాశాలలో చేర్పించా. కేవలం జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన వస్తుందన్న ధైర్యంతోనే వారి చదువులు సాగుతున్నాయి. కళాశాల ఫీజులు, పిల్లల చదువు ఖర్చులు జగనన్న ఇస్తున్నారు. నాలాంటి వారికి ఈ పథకం ఎంతో ఉపయోగ పడుతోంది.

'బెంతుల ఆశాజ్యోతి సీఎం జగన్'



జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బెంతు ఒరియా సంఘ ప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: బెంతు ఒరియాల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఇచ్ఛాపురం నియోజకవర్గ బెంతు ఒరియా సంక్షేమ సంఘం ప్రతినిధులు కొనియాడారు. బెంతు ఒరియాల జీవన పరిస్థితులు, వారి స్థితిగతులపై ఈ నెల 5,6 తేదీల్లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐ.శ్యామ్యూల్ ఆనంద్‌తో కూడిన వన్ మ్యాన్ కమిషన్ పర్యటించిన నేపథ్యంలో ఆదివారం లొద్దపుట్టి ప్రజాసంకల్పయాత్ర విజయ స్థూపం వద్ద సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు సుమనఖ మిసాయి, దుదిష్టి మజ్జిలు మాట్లాడుతూ దశాబ్దాల నుంచి ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు కోసం పోరాడుతున్నప్పటికీ గత ప్రభుత్వాలు తమ జాతి కోసం పట్టించుకోలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన అనంతరం తమ కోసం ప్రత్యేక కమిషన్ వేసి మా స్థితిగతులు తెలుసుకున్నారని, సీఎం జగనన్న మాకోసం మంచి చేస్తారని ఆశిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు బృందావన్ బిసాయి, శంకర్ సాహూ, జయశేన్ బిసాయి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన స్కూల్‌గేమ్స్
అథ్లెటిక్స్ పోరు



బాలుర 100 మీటర్ల పరుగు పందెంలో దూసుకెళ్తున్న అథ్లెట్స్

- హోరాహోరీగా సాగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీలు
- విజేతలకు పతకాలు, ప్రశంసా పత్రాల అందజేత



వ్యక్తిగత చాంపియన్లుగా నిలిచిన అథ్లెట్స్‌కు ట్రోఫీలను అందజేస్తున్న డీఈఓ జి.పగడాలమ్మ, పరిశీలకులు రంగారావు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగిన ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ముగిశాయి. అండర్-14, అండర్-17 బాలబాలికల పోరు 21నే ముగియగా.. అండర్-19 విభాగంలో బాలబాలికలకు ఆదివారం పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో విశాఖపట్నం, వైఎస్సార్ కడప, తూర్పుగోదావరి, నెల్లూరు, శ్రీకాకుళం, గుంటూరు, ప్రకాశం జిల్లాల క్రీడాకారులు సత్తాచాటారు. 66వ ఏపీ రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-19 అథ్లెటిక్స్ పోటీల్లో వ్యక్తిగత విభాగాల్లో చాంపియన్లుగా బాలురు విభాగంలో బి.హేమతేజ (నెల్లూరు)828 పాయింట్లతో, బాలికల విభాగంలో ఎం.మానస (గుంటూరు) 664 పాయింట్లతో నిలిచి బహుమతులు అందుకున్నారు.

జాతీయ పోటీలకు సన్నద్ధం కండి: డీఈఓ

రాష్ట్రపోటీల్లో చూపించిన పోరాట ప్రతిభతో జాతీయ పోటీలకు సన్నద్ధం కావాలని జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షురాలు, డీఈఓ గార పగడాలమ్మ పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు పతకాలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బీవీ రమణ మాట్లాడుతు మూడు రోజుల రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీల నిర్వహణ, ఏర్పాట్లు, విశేషాలను వివరించారు. శ్రీకాకుళంలో మీట్ నిర్వహణ అత్యద్భుతంగా చేశారని, ఎలాంటి లోటుపాట్లు కనిపించలేదని మీట్ పరిశీలకులు టీవీఎస్ రంగారావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి పి.సుందరరావు, జిల్లా పీఈటీ సంఘ అధ్యక్షుడు ఎంవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎం.సాంబమూర్తి, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, ఎం.ఆనంద్‌కిరణ్, టెక్నికల్ కమిటీ చైర్మన్ కె.హరిబాబు, ఎం.తిరుపతిరావు, పి.తవిటయ్య, నారాయణరావు, నిర్మల్‌కృష్ణ, మాధురి, సుశీల, పీడీలు, టెక్నికల్ అఫీషియల్స్ పాల్గొన్నారు.

ఇంతటి ఆతిథ్యం.. సిక్కోలుకే సాధ్యం

సిక్కోలు ఆతిథ్యాన్ని మరువలేమని మీట్‌కు హాజరైన క్రీడాకారులు తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పోటీల్లో దాదాపు 1800 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించగా మరో 120 మంది కోచ్ మేనేజర్లు హాజరయ్యారు. టెక్నికల్ అఫీషియల్స్ 100 మంది వరకు మీట్ నిర్వహణలో భాగస్వామ్యులయ్యారు. తమ సొంత మనుషుల్లా చూసుకున్నారని, ఇంతటి ఆతిథ్యాన్ని గతంలో ఎన్నడూ.. ఎక్కడా చూడలేదని తమ మనుసులో మాటలను 'సాక్షి'తో వ్యక్తం చేశారు.

ఇంతలా మమ్మల్ని ఎక్కడా ఆదరించలేదు..



నేను విశాఖపట్నం జిల్లా తరఫున ఆడాను. స్టీల్‌ప్లాంట్ దగ్గరలో మా నివాసం. ద్వితీయ ఇంటర్ ఎంపీసీ చదువుతున్నాను. ఇప్పటి వరకు అనేక టోర్నీలు, క్రాస్‌కంట్రీ పోటీల్లో పాల్గొన్నాను. ఇంతలా మమ్మల్ని ఎక్కడా ఆదరించలేదు. ఈ జ్ఞాపకాలు మరువలేం. థాంక్స్ టు శ్రీకాకుళం.

– కె.హేమాంగిని, విశాఖపట్నం జిల్లా

ఏర్పాట్లు చాలా బావున్నాయి..



మాది గుంటూరు జిల్లా వేజెండ్ల. సెకెండియర్ ఇంటర్ చదువుతున్నాను. 400రిలేలో కాంస్య పతకం వచ్చింది. శ్రీకాకుళంలో మీట్‌కు హాజరయ్యేముందు ఏర్పాట్లు, వసతుల కోసం చాలా భయపడ్డాం. కానీ ఇక్కడకు వచ్చాక మమ్మల్ని చాలా బాగా చూసుకున్నారు. భోజనాలు, వసతి, గ్రౌండ్ ఇలా అన్ని చాలా బావున్నాయి.

– వేజెండ్ల రజిని, గుంటూరు జిల్లా

సిక్కోలుకు హ్యాట్సాఫ్..



నేను విద్యా శాఖ నుంచి ఎస్‌జీఎఫ్ నియమించిన పరిశీలకులగా శ్రీకాకుళం వచ్చాను. మూడు రోజులపాటు పోటీలు అత్యద్భుతంగా సాగాయి. 1800 మంది ప్లేయర్స్, 120 మంది కోచ్ మేనేజర్లు హాజరయ్యారు. టెక్నికల్ అఫీషియల్స్‌గా మరో 91 మంది పాల్గొన్నారు. ఎక్కడా ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేశారు. వసతి, భోజనాలు, ట్రాక్, ఫీల్డ్, ఆతిథ్యం ఇలా ఎక్కడా లోటులేకుండా ప్రతిష్టాత్మకంగా ఏర్పాట్లు చేశారు. హ్యాట్సాఫ్ టు సిక్కోలు.

– టీవీఎస్ రంగారావు, ఏపీ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ మీట్ పరిశీలకులు. కాకినాడ

సహకరించిన అందరికీ కృతజ్ఞతలు



66వ ఏపీ రాష్ట్ర స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ పోటీలను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి జిల్లా స్కూల్ గేమ్స్ తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం. మంత్రి ధర్మాన చొరవ, డీఈఓ సాయం, అరబిందో ఫార్మా చేయూత, దాతల దాతృత్వం, పీడీ-పీఈటీల సమష్టి కృషితో గతంలో ఎన్నడూలేని జరగని విధంగా అథ్లెటిక్స్ మీట్‌ను విజయవంతంగా నిర్వహించగలిగాం.

– బడి వెంకటరమణ, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి, మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ

మంచు తెరలో మధుకేశ్వరుడు



మంచు తెరల మధ్య మధుకేశ్వరుని ఆలయం ఆహ్లాదంగా కనిపించింది. మాఘ మాసం తొలి రోజున ఆదివారం ఉదయం దట్టమైన మంచు పడడంతో ముఖలింగేశ్వరుని ఆలయం ఇలా కొత్తగా కనిపించింది. – జలుమూరు

ఉద్దానం సాహిత్యం కాపాడుకుందాం

- ఉత్తరాంధ్ర రచయితల మహాసభలో స్పీకర్ తమ్మినేని సీతారాం
- మహాసభలు పెట్టడం సంతోషకరం: మంత్రి సీదిరి



అందెశ్రీని సత్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ: తెలుగు భాషలో ఉద్దానం యాస అద్భుతంగా ఉంటుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో గత రెండురోజులుగా ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న ఉత్తరాంధ్ర రచయితల మహాసభలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. తెలుగు సాహిత్యంలో ఉద్దానం ప్రాంతానికి ప్రత్యేక స్థానం ఉందని, దాన్ని కాపాడుకుందామన్నారు. పల్లెపాటలు, సామెతలు, రచనలు, కవితలు అన్నీ ఉద్దానంలో ఓ నిలయం పెట్టి అందులో భద్రపరిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. అంతకుముందు మంత్రి సీదిరి అప్పలరాజు మాట్లాడుతూ పలాసలో రచయితల మహాసభలు పెట్టడం సంతోషకరమన్నారు. ఆనాడు తెలంగాణ రచనలు, పాటలు, కళాకారులు అభినయం ఊరికే పోలేదని, తెలంగాణ సాధనకు ఉపయోగపడ్డాయని అన్నారు. మన ఉత్తరాంధ్ర రచయితలు అందరూ కలిసి మన ప్రాంతం అభివృద్ధికి పాటుపడాలన్నారు. సభాధ్యక్షుడిగా వ్యవహరించిన కుమార్ నాయక్ నేతృత్వంలో పలువురు నడుపుతున్న పిల్లల మాస పత్రికలను, కొత్త రచనలను ఆవిష్కరించి ప్రజాగాయకుడు, రచయిత అందెశ్రీని సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, ఏఎంసీ చైర్మన్ పీవీ సతీష్, చిగురువలస జగదీష్, తెప్పల కృష్ణమూర్తి, కుత్తుం వినోద్, కుమార్ నాయక్, షణ్ముఖరావు, శివజ్యోతి, రాజారావు, ఉర్నాన అప్పలరాజు, గుమ్మడి సాంభమూర్తి, బూర్జ కోటేశ్వరరావు తదితరలు పాల్గొన్నారు.

పాడి లేవని రోజు పండగే..

'పాట పాడుదామని వచ్చిన నేను ఉద్దాన పరిస్థితి చెవినపడి గొంతు రాక పాడలేకపోతున్నాను' అని గేయ రచయిత అందెశ్రీ అన్నారు. పలాసలో జరుగుతున్న ఉత్తరాంధ్ర మహాసభల్లో పాల్గొన్న ఆయన ఉద్వేగంగా మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న దానికంటే మరింత ఆసక్తి చూసి ఇక్కడి నుంచి కిడ్నీ మహమ్మారిని తరిమి కొట్టాలన్నారు. గత రెండు రోజులుగా ఉద్దానం కవులు, కళాకారులు అనేక రూపాల్లో కిడ్నీ మహమ్మారి గురించి వివరిస్తే తన గుండె తరుక్కుపోయిందన్నారు. తెలంగాణకు గేయం రాసిన తాను దానికి ముందే తెలుగు భాష కోసం పాటను రాశానని పాడి వినిపించారు. మాయమై పోతున్నడమ్మా మనిషన్నవాడు పాట పాడమని సాహిత్యకళాకారులు కోరగా పాడి లేవని రోజు పండుగ చేసుకుంటున్నామని ఉద్దాన వాసులు అంటుంటే నేను ఎలా పాడగలనని నిరాకరించారు.

ప్రశాంతంగా కానిస్టేబుల్ పరీక్షలు



శివానీ కాలేజీలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక





శ్రీకాకుళంలోని పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల క్యూ (ఇన్‌సెట్లో) చైతన్య కాలేజీ వద్ద కేంద్రం లోపలకు అభ్యర్థులను విడిచిపెడుతున్న పోలీసులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్ ప్రిలిమినరీ (ప్రాథమిక రాత) పరీక్షలు జరిగాయని ఎస్పీ జీఆర్ రాధిక వెల్లడించారు. జిల్లాలోని పలు పరీక్ష కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లను ఎస్పీ స్వయంగా పర్యవేక్షించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీగా బందోబస్తు నిర్వహించారు.

జిల్లా పరీక్ష నోడల్ అధికారి డీఎస్పీ జి.ప్రేమ్‌కాజల్, శ్రీకాకుళం రీజియన్ ప్రాంత నోడల్ అధికారి సబ్‌డివిజన్ డీఎస్పీ మహేంద్ర మాతే, టెక్కలి రీజియన్ ప్రాంత నోడల్ అధికారి డిప్యూటీ ఎస్పీ జి.శ్రీనివాసరావుల సమక్షంలోని పోలీసు టీమ్‌లు చక్కగా విధులు నిర్వర్తించాయని ఎస్పీ పేర్కొన్నారు. జిల్లాలో మొత్తం 730 (సివిల్ కానిస్టేబుళ్లు - 100, ఏపీఎస్పీ బెటాలియన్ ఐఆర్ ఎచ్చెర్ల 630) పోస్టులకు గాను 23,735 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 22,355 మంది హాజరయ్యారు. 1380 మంది గైర్హాజరయ్యారు. మహిళలు 5584 మంది దరఖాస్తు చేసుకోగా 432 మంది గైర్హాజరయ్యారు. పురుషులు 18151 మంది దరఖాస్తు చేసుకోగా 1380 మంది గైర్హాజరయ్యారు.

26న వాసుదేవుని సన్నిధిలో
శ్రీపంచమి వేడుకలు

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్ స్వామి ఆలయంలో ఈ నెల 26న శ్రీపంచమి వేడుకలు నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. గతంలో ఇదే ఆలయంలో వేద అధ్యయన కేంద్రం ఉండేదని, ఇక్కడ చదువుకున్న వారు గొప్ప పండితులు అయ్యారన్నారు. ఇదే స్ఫూర్తితో ఉచిత అక్షరాభ్యాసన కార్యక్రమం కూడా వికాస తరంగిణి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను ఆలయం వద్ద ఈ నెల 25వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9441869044, 9866060260 అనే నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రేపు జిల్లాస్థాయి సీఎం కప్ పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శాప్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి సీఎం కప్ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ ఈ నెల 24న నిర్వహిస్తున్నట్టు డీఎస్ఏ చీఫ్ కోచ్ ఎం.మాధురీలత ఆదివారం తెలిపారు. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా పురుషులు, మహిళలకు కబడ్డీ, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ, బాక్సింగ్, టెన్నిస్, బ్యాడ్మింటన్, వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాంశాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. టేబుల్‌టెన్నిస్ పోటీలు పీఎన్‌కాలనీలోని న్యూసెంట్రల్ స్కూల్ వేదికగా జరుగుతాయని పేర్కొన్నారు.

అరసవల్లి చేరిన అమరావతి ఉద్యమ నేత తిరుపతిరావు

అరసవల్లి: అమరావతి జేఏసీ నేత గద్దె తిరుపతిరావు ఆదివారం ఉదయం శ్రీకాకుళం జిల్లా అరసవల్లికి చేరుకున్నారు. ఈయనకు స్థానిక జిల్లా టీడీపీ నేతలు మాజీ ఎమ్మెల్యేలు కూన రవికుమార్, గుండ లక్ష్మీ దేవి తదితరులు స్వాగతం పలికారు. ఆదిత్యుడిని దర్శించుకుని అనంతరం విలేకరులతో మాట్లాడారు. అమరావతి–అరసవల్లి పేరిట పాదయాత్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుందని, అక్కడి నుంచి తాను ఒక్కడినే పాదయాత్రగా అరసవల్లి చేరుకుని మొక్కు చెల్లించుకున్నానని తెలియజేశారు. కాగా, అమరావతికి మద్దతు పలుకుతున్న స్థానిక టీడీపీ నేతలపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

అంతర్జాతీయ నడక పోటీల విజేతకు సత్కారం



సుధాకర్‌ను సన్మానిస్తున్న వాకర్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం అర్బన్: అంతర్జాతీయ నడక పోటీల్లో పతకాలు సాధిస్తున్న శ్రీకాకుళం నగరానికి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు సంజీవిని నళిని సుధాకర్‌కు వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థలు బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేయాలని తీర్మానం చేసినట్లు శ్రీకాకుళం వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు పేర్కొన్నారు. శ్రీలంక దేశంలోని కొలంబో నగరంలో ఈ నెల 14, 15 తేదీల్లో జరిగిన 36వ అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఐదు కిలోమీటర్ల నడక విభాగంలో ద్వితీయ స్థానం సాధించిన సుధాకర్‌కు ఆదివారం శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వాకర్స్ సంస్థల చీఫ్ కో–ఆర్డినేటర్ పి.జి.గుప్తా మాట్లాడుతూ మార్చిలో ఒడిశా రాష్ట్రం బరంపురంలో జరగనున్న వాకర్స్ ఇంటర్నేషనల్ సమావేశాల్లో సుధాకర్‌ను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ఎస్పీఎఫ్ డీజీపీ



మెహ్రోకు జ్ఞాపిక అందజేస్తున్న ఈఓ

అరసవల్లి: ప్రత్యక్షదైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామిని ఏపీ ఎస్పీఎఫ్ డీజీపీ సంతోష్ మెహ్రా ఆదివారం దర్శనాన్ని చేసుకున్నారు. ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. సూర్యనమస్కార పండితుడు రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో సూర్యనమస్కార పూజలు చేయించుకున్నారు. ఆదిత్యుని దర్శనం అద్భుతమని మెహ్రా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈయన వెంట వన్‌టౌన్ సీఐ నాయుడు తదితరులు ఉన్నారు.

సర్కారీ విద్యార్థుల.. స్మార్ట్ పాఠాలు

- మిస్టర్ లెర్నర్ యాప్‌ను రూపొందించిన సీతాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
- సులువుగా అర్థమయ్యేలా ఆడియో, వీడియో పాఠాలు
- ప్లేస్టోర్‌లో రిజిస్ట్రేషన్‌కు చేయూతనివ్వాలని విజ్ఞప్తి



మిస్టర్ లెర్నర్ యాప్‌ను చూపుతున్న సీతాపురం జెడ్పీ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు

టెక్కలి: ఇప్పుడంతా స్మార్ట్ యుగం. ఫోన్ యాప్‌ల ద్వారా కష్టసాధ్యమైన పని కూడా చిటికెలో పూర్తి చేయవచ్చు. సాధారంగా పూర్తిస్థాయిలో కంప్యూటర్, మొబైల్ పరిజ్ఞానం కలిగిన ఉద్యోగులు, విద్యార్థులు వివిధ రకాల మొబైల్ యాప్‌లు రూపకల్పన చేస్తుంటారు. అయితే టెక్కలి మండలం సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న లఖినాన గణేష్‌బాబు, బెండి దీపాంక్, మామిడి కార్తీక్ తదితర విద్యార్థులు మాత్రం పిట్టకొంచెం కూత ఘనంగా అన్న చందంగా సాంకేతికతలో సత్తాచాటుతున్నారు. కంప్యూటర్, మొబైల్ పరిజ్ఞానం కలిగిన తోటి స్నేహితుల నుంచి ప్రోగ్రామ్ కోడింగ్ తెలుసుకుని విద్యార్థులకు ఉపయోగకరమైన స్మార్ట్ పాఠాల యాప్‌ను సృష్టించి అబ్బురపరిచారు. 'మిస్టర్ లెర్నర్ యాప్'కు రూపకల్పన చేసి ప్రశంసలు అందుకుంటున్నారు.

సులువుగా ఆడియో, వీడియో పాఠాలు: మిస్టర్ లెర్నర్ యాప్‌లో 6 నుంచి 10వ తరగతి వరకు అన్ని సబ్జెక్టులకు సంబంధించి ఆడియో, వీడియో పాఠాలు రూపకల్పన చేశారు. మేధాశక్తికి పదును పెట్టేలా బ్రెయిన్ డెవలప్‌మెంట్ గేమ్స్ సిద్ధం చేశారు. మీట్ విత్ టీచర్స్, చాట్ విత్ ఫ్రెండ్స్, వీడియో క్లాస్, నోట్స్, బ్రెయిన్ డెవలప్‌మెంట్ గేమ్స్ రూపొందించారు. అయితే ప్లేస్టోర్ లో యాప్ రిజిస్ట్రేషన్‌కు ఆర్థికంగా ఇబ్బందులు ఉండటంతో ప్రస్తుతానికి ఫోన్ నంబర్ ద్వారా వెబ్ లింక్‌తో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునేలా అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎవరికైనా మిస్టర్ లెర్నర్ యాప్ డౌన్‌లోడ్ కావాలంటే 7989071033 నంబర్‌ను సంప్రదిస్తే ఆయా విద్యార్థులు వాట్సాప్ ద్వారా యాప్ లింక్‌ను పంపిస్తారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..

యాప్ రూపకల్పన విషయంలో అన్ని రకాల సబ్జెక్టులను అనుసంధానం చేసేందుకు ఉపాధ్యాయులు ఎంతగానో సహకరించి ప్రోత్సహించారు. పాఠశాలలో కంప్యూటర్లు ఉపయోగించుకునేలా సహకరించారు. మిస్టర్ లెర్నర్ యాప్‌ను ప్లేస్టోర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు కొంత ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నాయి. వాటిని అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– ఎల్.గణేష్‌బాబు, సీతాపురం హైస్కూల్ విద్యార్థి, టెక్కలి మండలం

మరిన్ని యాప్‌లు..

మొదటి ప్రయత్నంలోనే విద్యార్థులకు ఉపయోగపడేలా మిస్టర్ లెర్నర్ యాప్‌కు రూపకల్పన చేశాం. ప్రస్తుతం పదోతరగతి పరీక్షలపై ప్రత్యేక దృష్టి సారించాం. భవిష్యత్‌లో విద్యార్థులకు ఉపయోగపడేలా మరిన్ని యాప్‌లు రూపకల్పన చేస్తాం.

– బి.దీపాంక్, సీతాపురం హైస్కూల్ విద్యార్థి, టెక్కలి మండలం

యుగపురుషుల మార్గం అనుసరణీయం



సత్సంగ విహార్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: మానవాళిపై కరుణ, ప్రేమ, దయామార్గాలు చూపాలన్న యుగపురుషుల మాటలు అనుసరణీయమని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. ఈదుపురం సత్సంగ్ విహార్‌లో ఆదివారం ఠాకూర్ అనుకూలచంద్ర ఠాగూర్ 135వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ ప్రవచనాలతో ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది శిష్యులను సంపాదించుకున్న అనుకూల చంద్ర ఠాగూర్ పూజ్యునీయులని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న 11వ సత్సంగ్ విహార్ ప్రతిష్ట స్మృతి మహోత్సవానికి అన్ని ప్రాంతాల నుంచి వచ్చిన శిష్యులు, భక్తులు ధన్యులని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ నర్తు రామారావు, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వరరావు, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, సర్పంచ్‌లు నర్తు వరప్రసాద్, దుక్క ధనలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ ఆశి పురుషోత్తమరెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, బొనమాళి బెహరా, ఎంపీటీసీ నర్తు ప్రేమ్‌కుమార్, రాంపత్ని చిట్టిబాబు, ఆశి కృష్టారెడ్డి, పిట్ట మామయ్య, ఉప్పాడ రాజారెడ్డి, ఇసురు తులసీరాం పాల్గొన్నారు.

సంద్రంలోకి ఆలివ్ రిడ్లే తాబేళ్లు



తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచిపెడుతున్న అటవీ శాఖాధికారులు

సోంపేట: అటవీశాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బట్టిగళ్లూరు వద్ద ఆదివారం ఆలివ్‌రిడ్లే తాబేళ్ల పిల్లలను సముద్రంలో విడిచి పెట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ సర్పంచ్ బట్టి మాధవరావు, బారువ సెక్షన్ అధికారి విజయ సారధి మాట్లాడుతూ అరుదైన జీవజాతులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతిపౌరుడిపై ఉందన్నారు. ముఖ్యంగా ఆలివ్‌రిడ్లే తాబేళ్లను సంరక్షించడానికి మత్స్యకారులు ముందుకురావాలన్నారు. కార్యక్రమంలో బారువ బీట్ అధికారి టి.సంతోష్, ట్రీ ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెట్టును మినీ వ్యాన్ ఢీకొని ఒకరి మృతి

- మరో 8 మందికి గాయాలు



అల్లుబోయిన మల్లేశు మృతదేహం

వీరఘట్టం: ఒడిశా రాష్ట్రం రాయగడలోని మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు వ్యాన్‌లో వెళ్లి తిరుగు ప్రయాణంలో వస్తుండగా ఆదివారం మధ్యాహ్నం వీరఘట్టం మండలం తూడి జంక్షన్ సమీపంలో ఓ చెట్టును వ్యాన్ బలంగా ఢీకొట్టింది. దీంతో జరిగిన ప్రమాదంలో ఒకరు మరణించగా మరో 8 మంది గాయాలపాలయ్యారు. వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలం యరకయ్యపేట, ఎలమంచిలికు చెందిన 15 మంది శనివారం రాత్రి రాయగడ మజ్జి గౌరమ్మను దర్శించుకునేందుకు మినీ వ్యాన్‌లో పయనమయ్యారు. ఆదివారం తెల్లవారుజామున అమ్మవారిని దర్శించుకుని ఉదయం 9 గంటలకు వ్యాన్‌లో బయలుదేరి తిరిగి వస్తుండగా తూడి జంక్షన్ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న చెట్టును వ్యాన్ బలంగా ఢీ కొట్టింది. దీంతో వ్యాన్‌లో ఉన్న అల్లుబోయిన మల్లేశు(40) రోడ్డుపై పడడంతో తలకు గాయమై తీవ్ర రక్తస్రావమైంది. అలాగే మరో 8 మందికి గాయాలు కావడంతో అందరినీ పాలకొండ ఏరియా ఆస్పత్రికి వైద్య కోసం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లేశు తుదిశ్వాస విడిచాడు. మిగిలిన వారిని మెరుగైన వైద్య చికిత్సల కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.హరికృష్ణ తెలిపారు.

ఎలమంచిలి, ఎరకయ్యపేటలో విషాదం..

కోటబొమ్మాళి: పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం తూడి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోటబొమ్మాళి మండలం ఎలమంచిలి గ్రామానికి చెందిన అల్లుబోయిన మల్లేసు మృతి చెందడం, ఎరకయ్యపేటకు చెందిన తొమ్మిది మంది గాయపడటంతో గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

వ్యసనాలకు బానిసై యువకుడు ఆత్మహత్య



కోరాడ రాజు(ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: పొన్నాడ పంచాయతీ తెప్పరేవుకు చెందిన కోరాడ రాజు (22) వ్యసనాలకు బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజు స్వగ్రామం సంతకవిటి మండలం ఎస్. అగ్రహారం. కొన్నాళ్లుగా తెప్పరేవులోని తాత ఇంటి వద్ద ఉంటున్నాడు. శ్రీకాకుళం పట్టణంలోని కిన్నెర కాంప్లెక్స్ థియేటర్‌లో పని చేస్తున్నాడు. ఇటీవలే టికెట్ కౌంటర్ నుంచి రూ.30 వేలు వాడుకున్నాడు. దీనికితోడు మద్యం, బెట్టింగులకు అలవాటు పడటం, అప్పులు, ఆర్థిక ఇబ్బందుల వల్ల మానసిక సంఘర్షణకు గురై ఈ నెల 20న కలుపు నియంత్రణ మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి శ్రీకాకుళం రూరల్ ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఆదివారం శ్రీకాకుళం రిమ్స్‌లో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఎచ్చెర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్

శ్రీకాకుళం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. కార్పొరేషన్ చైర్మన్ పదవిని మరో రెండేళ్లు పెంచిన నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పాదయాత్ర హామీల మేరకు నవరత్నాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయ వ్యవస్థతో పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. టీడీపీ హయాంలో దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. విపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే ప్రజలు పట్టం కడతారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సురంగి మోహన్‌రావు, కరణం శ్రీనివాసరావు, కొండాల గణేష్, టంకాల బాలకృష్ణ, కరినేని హరి, కనుగుల నారాయణరావు, బోడిగంజి బాలు తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆర్టీసీ కాంప్లెక్స్



శ్రీకాకుళం కాంప్లెక్స్‌లోని నాన్‌స్టాప్ పోర్టికో వద్ద ప్రయాణికుల రద్దీ

శ్రీకాకుళం అర్బన్: సంక్రాంతి అనంతరం సెలవులు ముగియడంతో ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆదివారం శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్‌కు పోటెత్తారు. పోలీస్ కానిస్టేబుల్ రాత పరీక్ష కూడా జరగడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీగా అభ్యర్థులు తరలిరావడంతో రద్దీగా కనిపించింది. దూరప్రాంత ప్రయాణికులు నాన్‌స్టాప్ కౌంటర్ వద్ద బారులు తీరారు. సాధారణ ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులు వచ్చిన ఎక్కేందుకు ఎగబడ్డారు. ఉదయం నుంచే ప్రయాణికుల రద్దీ అధికంగా ఉండటంతో శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ కె.మాధవ్ పర్యవేక్షించారు.

మొక్కజొన్న పంటకు అడవిపందుల బెడద



కేశవరాయునిపురంలో ధ్వంసమైన మొక్కజొన్న పంట

లావేరు:

మండలంలోని కేశవరాయునిపురం, జీజీవలస, లావేటిపాలెం గ్రామాల్లో మొక్కజొన్న పంటను అడవి పందులు నాశనం చేస్తున్నాయి. పంట పొట్ట దశలో ఉన్న సమయంలో రాత్రివేళ అడవి పందులు గుంపులుగా వచ్చి నష్టం కలిగిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రంతా మేల్కొని కాపలా కాయాల్సి వస్తోందని వాపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఓవైపు పంటలు కలిసి రాక ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు అడవి పందుల బెడదతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

ఆర్డీఓ అనుమతి పత్రంతోనే వీఐపీ టికెట్లు



వి.హరిసూర్యప్రకాష్, ఈఓ



అరసవల్లి: రథసప్తమి మహోత్సవం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో వీఐపీల దర్శనాలకు ఈ ఏడాది నుంచి ప్రత్యేకంగా రూ.500 టిక్కెట్ల విక్రయాలను ఈనెల 24 నుంచి అందుబాటులోకి ఉంచుతున్నట్లుగా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్ ప్రకటించారు. ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర దేవదాయ శాఖ ఉన్నతాధికారుల నిర్ణయం మేరకు వీఐపీలకు కూడా ప్రత్యేక టిక్కెట్లు కొనుగోలు చేసుకునేలా చర్యలు చేపట్టినట్లుగా వివరించారు. అయితే ఈ టిక్కెట్లు పొందాలంటే శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి (బొడ్డేపల్లి శాంతి) నుంచి అనుమతి పత్రం ఉండాలని, ఈ పత్రాన్ని చూపించి, అరసవల్లి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచిలో రూ.500 చెల్లించి ఒక్కో వీఐపీ టిక్కెట్టును కొనుగోలు చేసుకోవాలని, వీటిని ఈనెల 24 నుంచి బ్యాంకులో అందుబాటులో ఉంటాయని, ఒక వీఐపీ టిక్కెట్టుతో ఇద్దరికి మాత్రమే విశిష్ట దర్శనానికి అనుమతివ్వనున్నట్లుగా ఆయన తెలియజేశారు. వీవీఐపీలకు ప్రోటోకాల్ ప్రాప్తికి నేరుగానే స్వామి వారి దర్శనం ఉంటుందని.. ఇందుకు తగిన ఏర్పాట్లు చేస్తామని వివరించారు.

పాసుల పంపిణీకి చర్యలు

రథసప్తమికి కీలకమైన డోనర్ పాసులు (దాతలు)ను ఈనెల 25, 26, 27వ తేదీల్లో స్థానిక ఆలయ కార్యాలయం వద్దనే ప్రత్యక్షంగా దాతలకు లేదా ఆయా దాతల సూచన మేరకు వారి సంబంధీకులకు మాత్రమే అందజేస్తామని ఆలయ ఈవో తెలిపారు. సోమవారం నుంచి ఆలయ సిబ్బందిచే మొత్తం దాతలందరికీ పాసుల పంపిణీకి సంబంధించిన సమాచారాన్ని ఫోన్‌లో సమాచారం అందజేస్తామని వివరించారు. అలాగే ఈనెల 26వ తేదీలోగా రూ.లక్ష లేదా అంతకుమించి విరాళాలిచ్చిన వారికి గడువు విధిస్తున్నామని, వీరికి కూడా దాతల పాసులను అందజేస్తామన్నారు. ప్రతి ఏడాదిలాగానే ఆలయ దాతలు తమ విరాళ రసీదుతో ఆలయ కార్యాలయాన్ని సంప్రదిస్తే ఈనెల 27లోగా దాతల పాసులను నేరుగా పొందవచ్చునని ఈఓ ప్రకటించారు.

అ'పూర్వ' సమ్మేళనం



మందస: గుడారిరాజమణిపురంలో ఉన్నత పాఠశాలలో 45 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు

వారంతా ఒకప్పుడు విద్యార్థులు. అనేక సంవత్సరాల తర్వాత తాము చదివిన బడిలో కలుసుకున్నారు. మళ్లీ విద్యార్థులుగా మారిపోయారు. ఆప్యాయంగా పలకరించుకుంటూ పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. కొంతమంది స్నేహితులు మరణించడంతో వారి ఆత్మకు శాంతి కలగాలని మౌనం పాటించారు. అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, సమాజానికి మేలు కలిగే పనులు చేయడానికి వారంతా నిర్ణయించుకున్నారు. ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. - సాక్షి నెట్‌వర్క్



కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికపై 2003 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సారవకోట ఉన్నత పాఠశాలలో 1978 - 79 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సారవకోట:హైస్కూల్లో ఒకే వేదికపై 1985 - 86 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



కాశీబుగ్గ: చినబాడాం ఉన్నత పాఠశాలలో 1981 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

COACHING CENTER
■ EAMCET & All Competitive Exams new Batchs will start from 23/1/23 @ Surya Academy, Gurajada Road, Kota Jn. Vizianagaram. Ph : 99490 03295 [V-5609]

Services

BUSINESS OFFER
■ We Super Stockist of FMCG Products of Masalas & Deserts is looking for District wise Distributors in TS & AP. www.mleps.in Cont. 70329 43367 [Y-748948]

SERVICES
■ పర్సనల్, బిజినెస్, ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి, వారం రోజులలో రుణం ఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. సంప్ర॥ 7836035286, 8901923173. [W-775803]

ఆయుర్వేదం
■ బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యం లేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడను. సంప్ర: 9603055647, 7995392747 [G-888]

Wanted

WANTED
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకోనుటకు వర్కర్స్, నర్సులు కావలెను, ఫ్రీ వసతి + భోజనం, జీ. 18k. ఏజెంట్ కమీషన్ 3k. ఫోన్ : 9640259988, 9640198899. [H-786821]
■ హైదరాబాద్ లో 5 స్టార్ హోటల్‌లో క్యాటరింగ్ బాయ్స్ & హౌస్‌కీపింగ్ బాయ్స్ కావలెను జీ: 13వే - 27 వేలు, రూం + మీల్స్ ఫ్రీ Age: 18-28 డైరెక్ట్ జాబ్, ఎటువంటి విద్యార్హతలు లేదు మగవారికి మాత్రమే.Ph:8333003754/ 8639879970 [H-792778]
■ VIP's ఇంట్లో పేషెంట్ ని చూసుకొవడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను, ఆయా, వార్డ్ బాయ్స్, నర్సులు, వంటవారు, Rmp. Dr. Q:5th-Degree, 10-30 వేలు జీతం, భో+రూం ఫ్రీ, Hyd. Ph: 7995374999 [HA-898]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.